గెడా రంగారావు

రెండు వేలిముద్రలు!

డాక్టర్ పెందుర్తి మాస్టర్జీ

ఆ ఇల్లు రెండంతస్తుల మేడ.

బజారు నానుకొని ఒక కాంపౌండ్ వాల్ వుంది. దానికి పెద్ద ఐరన్ గేటు. గేటుకు చిన్న తలుపు వుంది. గేటునుండి ఇరవై గజాల దూరం అందమైన పూలచెట్లు వున్నాయి.

లోపల అంతకంటె అందమైన అమ్మాయిలు వుంటారని కొందరికే తెలుసు.

పల్లవి గేటు తెరచి లోపలకు నడిచింది. చేతిలో అందమైన పూలబుట్ట, ఎరుపురంగు లంగా, నీలంరంగు పరికిణీ, పచ్చరంగు రవిక, కురచగా వేసుకున్న జడ, మువ్వల పట్టాలు. విశాలమైన నేత్రాలు, ఊటి టమాటారంగు పెదవులు.

"అమ్మగారూ! పూలు తెచ్చాను."

ఎదురుగా సోఫాలో కూర్చున్న నలభై ఏళ్ళ స్త్రీ నవ్వింది.

"ఏమే నిన్న రాలేదు?"

"మా అమ్మకు సుస్తీగా వుందమ్మా! అందుకే రాలేదు."

"సరేలే ఇచ్చి వెళ్ళు" అంది కామాక్షి.

అప్పుడే బయట కారాగింది. సోఫాలో సాఫీగా కూర్చున్న కామాక్షమ్మ ఆత్రృతగా లేచింది.

ఓ నలభై ఏళ్ళ వ్యక్తి పంచె, లాల్చీ ధరించి వున్నాడు. గుంభనగా, గంభీరంగా లోపలకు వచ్చాడు. వస్తూనే అతని కళ్ళు పల్లవిపై పడ్డాయి.

"ఏమిటి అలా చూస్తున్నారు?"

"కొత్త పిట్టా?"

"మాకు పువ్వులిచ్చే అమ్మాయి. అలా అనకండి. ఆ పిల్ల అలాంటిది కాదు" అంది కామాక్షమ్మ అనునయంగా.

"ఓఁ!" అంటూ నెమ్మదిగా లక్ష్మీపతి ఆ అమ్మాయి దగ్గరకు నడిచాడు. పల్లవి భయంగా చూస్తుంది. లక్ష్మీపతి ముఖం రంగు మారింది. "కథలు చెప్పక ఇది చాలా పెద్ద కేసు."

"ఏమిటండీ మీర నేది?"

"బొంబాయిలో ఒక రాత్రి ఈ అమ్మాయితో గడిపాను."

కామాక్షి ఉలిక్కిపడింది. పల్లవి భయాందోళనలతో ఆశ్చర్యంగా చూసింది.

"మీరు పొరపాటు పడివుంటారు. ఎప్పుడు?"

"సరిగ్గా డిసెంబరు నెల."

"భలేవారు. సరిగ్గా రెండు సంవత్సరాలనుండి రోజూ తప్పకుండా పూలు వేస్తుంది. మనిషిలాంటి మనిషి వుండ వచ్చు."

లక్ష్మీపతి పెదవులు బిగించాడు.

పల్లవి వెళ్ళిపోయింది. పల్లవి వెళుతున్నవైపే ఆలో చిస్తూ చూస్తుండిపోయాడు లక్ష్మీపతి.

2

"హలో డాలీ!" అన్నాడు ప్రక్కనే కారు నడుపుతూ.

పల్లవి చటుక్కున వెనుతిరిగి చూసింది.

"మీరా?"

"ఓ రూపాయి పువ్వులివ్వు."

"రూపాయి పువ్వులు మీ ఆవిడ పెట్టుకుంటుం దాండీ?"

"ఏం, పెట్టుకోకూడదా? ఇదిగో అమ్మాయ్! ఈ పువ్వులు నావి కాదు."

"మరి?" పువ్వులు అందించింది.

"నా కారుకి." రూపాయి ఇచ్చాడు.

"కారుకి పువ్వులు పెట్టబట్టే ఇలా మండుతున్నాయి."

"ఏమిటి, కార్లా?"

"కాదండి. పువ్వులు."

"ఏది? చల్లగా వున్నాయే!"

పల్లవి నవ్వింది. "మీరు తమాషాగా మాట్లాడతారు."

"కాని ఏం లాభం?" నా మాటలు వినటానికి నా పెళ్ళాం లేదు."

"పెళ్ళాం ఎంతసేపండి. ఈ కారులో యిలా వెళ్ళి అలా వచ్చేలోపు ఎవరో ఒకరు దొరుకుతారు."

"ఎవరు? పిల్ల తల్లులా?"

పల్లవి మళ్ళీ నవ్వింది. "భలేవారే! అమ్మాయిలండి."

"ఏం దొరకటమో ఏమో నాది ఒకే ఐడియా. అమ్మాయి అచ్చు ఆంధ్రయువతిలా వుండాలి. నీలాగ నవ్వుతూ మాట్లాడాలి. అప్పుడప్పుడు కోపంగా వుండాలి కూడా. నీలాగే పేదరాలై వుండాలి. నీలాగే నుదుటన దోసగింజలాంటి బొట్టు వుండాలి."

"నాకు తెలిసి అమ్మాయిలు అలా ఎవరూ లేరండి. అయినా ప్రయత్నిస్తాను" అంది పల్లవి.

మధుకి నవ్వొచ్చింది. ఇంత అమాయకురాలేమిటి అను కున్నాడు మనసులో. "సరే, రేపు యిదే వేళకు ఇక్కడే వుంటాను."

"మంచి పువ్వులు తెస్తానులెండి."

"పువ్వులు తెస్తావో, పువ్వులాంటి పిల్లని తెస్తావో!"

కారు కదిలింది. మధు వెళ్ళినవైపే పల్లవి చూస్తోంది.

3

లక్ష్మీపతి సాక్షీగా సోఫాలో కూర్చున్నాడు. ప్రక్కనే కూర్చున్న వ్యక్తి అన్నాడు. "పల్లవి మధుని ప్రేమిస్తు న్నట్లుంది." లక్ష్మీపతి సిగర్ వెలిగించాడు.

"అవును. పల్లవిని ఇంకా ఎందరు ప్రేమిస్తారో?"

"అదేమిటి బాస్!"

"నీకు తెలీదు మూర్తీ!" అంటుండగా పల్లవి వచ్చింది.

"రామ్మా! పల్లవీ!" అన్నాడు లక్ష్మీపతి.

"పిలిచారట. ఎందుకు?"

"ఏం లేదు. చనిపోయిన మా అమ్మాయి పుట్టిన రోజు ఈ వేళ. నా సంతోషంకోరకు ఈ బట్టలు కట్టుకొని పాట కచేరీకి వెళ్ళమ్మా!"

పల్లవి ఆశ్చర్యంగా చూసింది. లక్ష్మీపతి ముఖం విషాదంగా వుంది. పల్లవి మాట్లాడకుండా ఆ దుస్తులు ధరించి పాటకచేరీకి వెళ్ళింది.

"బాస్! ఏమిటిది?"

"అంతా ప్లాను. పల్లవిని ఎందరు వెంబడిస్తారో ఇప్పుడే తెలుస్తుంది. పల్లవిని వాచ్ చెయ్యి."

"అలాగే బాస్!"

4

మాలినీ పాటకచేరి.

ఆమె సంగీతకచేరీకి దేశవిదేశాలలో పేరుప్రఖ్యాతులున్నాయి. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే ఆ కచేరీకి పురప్రముఖులు, ప్రజానాయకులు, ఇంకా ఎందరో సామాన్యులు వచ్చారు.

పోర్టికోలో చెవర్లీ, ఇంపాలా ఎన్నో రకాల కార్లు, మోటార్ సైకిళ్ళు వున్నాయి.

పల్లవి భయంగా డ్రైవర్ చెప్పిన చోట కూర్చుంది. క్రొత్తగా, క్రొత్త మనుషుల మధ్య పెద్ద శ్రీమంతురాలులా వుంది.

డయాస్ మీద లైట్ మ్యూజిక్ వినిపిస్తోంది.

మధు పోర్టికోలో కారాపాడు. లోపలికి ప్రవేశించి పల్లవిని చూసి చకితుడయ్యాడు.

తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు.

మాలినీ సంగీతం ప్రారంభమైంది.

డ్రెస్ సర్కిల్‌లో ప్రక్కనే కూర్చున్న పల్లవి మునపటి పల్లవిలా లేదు. ఏ కోటీశ్వరుడి భార్యలాగానో వుంది.

ఆమె కట్టుకున్న షిఫాన్ చీర ఆకుపచ్చగా వుండి, అదే రంగుతో వున్న రవికలో అవయవాల పొందిక, అధరాల అందం ప్రత్యక్షంగా కనిపిస్తోంది. మెడలో లాకెట్టు, చెవులకు రింగులు, జ్యోతిలా పెట్టిన బొట్టు. పల్లవి అవునా? కాదా? అన్న ప్రశ్న మనసులో మెదిలింది మధుకు.

"పల్లవీ!" ప్రయత్నంగా పిలిచాడు.

ఆమె తనవైపు తిరిగి "ఎవరు మీరు?" అంది. మతి పోయినట్లయింది మధుకి. "సారీ! మా పల్లవి ఏమో అనుకున్నాను."

"నేనలా వున్నానా?"

"అఫ్‌కోర్స్!" అన్నాడు నవ్వి.

నీలిమా మాలిని వేదికపైకి వచ్చి అందరికి నమస్కరించింది. కరతాళధ్వనులతో హాలు ప్రతిధ్వనించింది.

కర్ణాటక సంగీతంతో ప్రారంభమైన గానం కొంతసేపు ప్రేక్షకుల మనసు రంజింపజేశాక కాస్త విశ్రాంతిసమయమైంది. అప్పటివరకు మధు చూస్తూనే వున్నాడు.

"నేను బావున్నానా?" అంది పల్లవి నవ్వి.

"ఎవరు నువ్వు?" మధు అడిగాడు.

"నేను పల్లవిని" అంది వింతగా నవ్వి.

"పల్లవి ఎవరో నాకు తెలీదు" అన్నాడు మధు.

పల్లవి బుంగమూతి పెట్టింది.

మధు నవ్వి "ఏమిటి యీ అవతారం?"

"లక్ష్మీపతిగారు యిలా పంపించారు. ఆయన చాలా మంచివారండి" అంది పల్లవి.

ప్రేక్షకుల్లోనుండి ఒక వ్యక్తి బైనాక్యులర్‌తో చూస్తున్నాడు. అతన్ని గమనించినా మధు గమనించనట్లు వూరుకున్నాడు. ట్వీడ్ సూట్‌లో వున్న ఆ మనిషి ఎవరై వుంటారు? ఈమెనే ప్రత్యేకంగా చూడటంలో అభిప్రాయం ఏమైవుంటుంది?

త్యాగరాజు గీతిక ప్రారంభించింది నీలిమ.

కొన్ని నిమిషాలలో సంగీతం ముగిసింది.

5

పల్లవి గబగబ బయటకు వచ్చేసింది. కాస్త వెనుకగా మధు వచ్చాడు. రోడ్డంతా కార్లతో, రిక్షాలతో, ఆటోలతో కోలాహలంగా వుంది.

బయట కారిడార్‌లో నిలబడ్డాడు మధు. పల్లవి కారులో వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న కారువైపు చూస్తూండిపోయాడు.

మధుకు ఆమె గురించి ఓ రకంగా అర్థంకాలేదు. ఆమె నిజంగా పూలమ్మే అమ్మాయా? లేక అలా నటిస్తోందా? ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఎంత వూహించినా ఆమె తన కళ్ళకు పూలమ్మే సామాన్యమైన యువతిలానే కనిపిస్తోంది.

"హల్లో మధూ!" భుజంపై చేయివేసింది లిలియా.

"నువ్వా?" భుజంపై చేయి తొలిగించాడు.

"ఎవరు అనుకున్నావ్?" అడిగింది.

మధు వింతగా నవ్వాడు. "నువ్వే అనుకున్నాను. ఈ ఆంధ్రదేశంలో ఇంత తేలిగ్గా నా భుజంపై చేయి వేయగల యువతి మరొకరు లేరు."

10

"కరెక్ట్. కాని ఆ స్థానం మరో యువతి ఆందుకుంటూంది" కాస్త బాధగా అంది.

మధు ఆమె కళ్ళలోనికి చూశాడు. ఆమె మధు ముఖంలో ఏదో వెదుకుతూ అంది. "డియర్ మధూ! నన్ను ప్రేమించలేవా?" కళ్ళలో కాంతు నింపుకొని అంది.

"సారీ లిలియా! ప్రేమ స్వవిషయం. నీలాంటి యువతి ప్రేమించు అన్నంతమాత్రంలో హఠాత్తుగా పొంగేది కాదు. నాలో ఒకేఒక సద్గుణముంది. విపరీతంగా తాగుతాను, డబ్బు లెక్కలేకుండా ఖర్చుపెడతాను, కాని స్త్రీ విషయంలో నా శీలం నిలుపుకుంటాను."

"అందుకే నీవంటే ఇష్టం!"

"ఇష్టంగానే వుంచు. ప్రేమించక. ప్రమాదం" అంటూ కారు దగ్గరకు నడిచి డోర్ తెరిచి లోపల కూర్చొని డ్రైవ్ చేశాడు. కారు సాగిపోయింది, లిలియా చూస్తుండిపోయింది.

6

ఫుట్ పాత్ మీద గబగబ నడుస్తోంది పల్లవి. వెనకగా కారులో వచ్చి సడన్ బ్రేక్ వేశాడు.

"మీరా?" అంది మధుని చూసి.

"అవును. మళ్ళీ అవతారం ధరించావ్! చూడు పల్లవీ! నీవు ఆ వేశ్యల ఇంటికి వెళ్ళవద్దు. నీ పువ్వులన్నీ నాకే అమ్ము. అన్నీ నేనే కొంటాను."

"ఎందుకని?"

"కొన్ని రోజులకు నీవు కూడా వేశ్యవంటారు."

పిడుగుపడ్డట్లయింది పల్లవికి.

"ఏమిటండీ మీరనేది?"

"నీకు తెలీదు పల్లవీ! నీకు తెలియకుండానే నీవు ఒక భయంకరమైన విషవలయంలో ఇరుక్కుంటున్నావు. లక్ష్మీపతి గురించి నీకు తెలీదు" మధు అన్నాడు.

"ఆయన చాలా మంచివారండి. ఆయన కూతురు నాలాగే వుండట. ఆమె చనిపోయిందట. అందుకే అప్పుడప్పుడు నన్ను అలంకరించుకోమంటారు."

మధు పెదవులు బిగించాడు. "నీ యిష్టం. నేను చెప్పగలిగింది నేను చెప్పాను." కాస్త చిరాకుగా మధు ముందుకు సాగాడు.

పల్లవి కాస్త సందిగ్ధంలో పడింది.

7

లిలియా యాష్ట్రేలో సిగరెట్ ఆర్పి లేచి టెలిఫోన్ దగ్గరకు నడిచింది. హోటల్ కౌంటర్లోనికి ఫోన్ చేసింది. "ట్రంక్ కాల్ టు బొంబాయ్" అంటూ నెంబర్ చెప్పింది.

కొన్ని క్షణాలలో అవతలినుండి ఫోను. "హలో!"

"హలో! లిలియాను మాట్లాడుతున్నాను."

"ఏమిటి?"

"మీకో గుడ్ న్యూస్. మీ ఫణి బ్రతికే వుంది."

"వాట్?" అవతలనుండి గొంతు.

"ఆశ్చర్యపోకండి. పైగా మిమ్మల్ని యీ లిలియా చీట్ చేయదు. ఫణి మైండ్ ఎఫెక్ట్ యిచ్చి అలా ప్రవర్తిస్తోందో, లేక నటిస్తోందో తెలియటంలేదు."

"ఫణి బ్రతికే వుందన్నమాట. ప్రస్తుతం ఎవరి స్వాధీనంలో వుంది?" అవతలనుండి.

"ఇంకా ఫలానా అని తెలీదు. కారు బ్రోకర్ మధు

అనే వ్యక్తి పెళ్ళిచేసుకోవాలని తాపత్రయపడుతున్నాడు. బైదిబై లక్ష్మీపతి అనే వ్యక్తి ట్రాప్ చేస్తున్నాడు. లక్ష్మీపతి ఎవరు ఏమిటి? అని నాకు తెలీదు.'''

''ఓ.కే. నీకు సహాయంగా రూబెన్‌ను పంపుతున్నాను. రూబెన్‌తో ఫణి వేలిముద్రలు పంపుతున్నాను. మొదట ఆమె ఫణి అవునా? కాదా? వేలిముద్రలతో తెలిసి పోతుంది. ఈలోపు కొంత డబ్బుకు లక్ష్మీపతి ఆమెను మనకు అప్పగిస్తాడేమో తెలుసుకో!''

''ఓ.కే. బాస్!''

''విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!''

''థాంక్యూ.''

8

పెద్ద బంగళా. కాస్త భయపడుతూనే గేటు తెరిచింది. ఎదురుగా స్తంభానికి కట్టిన ఆల్సెషన్ కుక్క అరుస్తుంది.

''ఇంట్లో ఎవరైనా వున్నారండీ?'' పిలిచింది.

''టామీ! ఏమిటీ గోల?'' అంటూ వచ్చాడు లక్ష్మీపతి.

లక్ష్మీపతి కళ్ళు జిగేల్మనేలా వుంది లిలియా అందం. నవ్వుతూ వినయంగా సమీపించాడు. ''ఎవరు కావాలండీ?'' అడిగాడు నవ్వుతూ.

''లక్ష్మీపతిగారు కావాలి.''

''నేనే లక్ష్మీపతిని.''

''నేను చాలా అదృష్టవంతురాల్ని. మీరే వచ్చారు.''

''లోపలకు రండి.'' ఇద్దరూ లోపలకు నడిచారు.

పెద్ద సోఫాలు, వాటికెదురుగా సోఫా కమ్ బెడ్,

గా్రేజ్ కుర్చీలు, అందమైన చిన్న టేబుల్స్, వాటి మీద వాడని పువ్వులు వున్నాయి.

“మీతో ఒక విషయం మాట్లాడాలి అని వచ్చాను.”

“చెప్పండి.”

“పల్లవి గురించి మీ అభిప్రాయం ఏమిటి?”

“అంటే?”

“అర్థం కాలేదా? పల్లవి మీద్వారా మా చేతికి చిక్కాలి. పల్లవిని మాకు ఆరు నెలలు అప్పగిస్తే మీకు రెండు లక్షలు యిస్తాం.” అంటూ కళ్ళలోనికి చూసింది.

“రెండు లక్షలా?”

“ఏం ఆశ్చర్యంగా వుందా? అయితే పల్లవిని ఓ రకంగా ట్రాప్ చెయ్యాలి. అది యిక్కడే సాధ్యం.”

“ఎలా?”

“ఎలాగో నేను చెపుతాను. నీవు మాతో సహకరించాలి. నీకు రెండు లక్షలతో పాటు కావాలంటే నేను కూడా.”

“అబ్బో! భగవంతుడు యీవేళ చాలా గొప్ప వరం యిచ్చాడు. అయితే ఒక్క మాట. నాకు లక్ష చాలు. నా శత్రువు ఒకడ్ని చంపాలి!”

“ఇంతే కదా!” చిటిక వేసింది.

“క్రిమ్‌వాళ్ళ ద్వారా?”

“నీకా భయం అవసరంలేదు. లిలియా ఎప్పుడూ మీకు తోడుగా వుంటుంది.”

“మరెప్పుడో?”

లిలియా నవ్వింది. “నిదానమే ప్రధానం. ముందు కర్తవ్యం. ఈలోపు పల్లవితో చాలా చనువుగా వుండాలి.”

“అది మీరు చెప్పాలా?”

బయట కుక్క మొరుగుతుంది. లక్ష్మీపతి కిటికీలోనుండి చూశాడు. "అరె, పల్లవి వచ్చింది."

"వెరీ గుడ్! చిన్న పని. ఒక గ్లాసు శుభ్రంగా తుడిచి మంచినీళ్ళు యివ్వు."

"ఎందుకు?"

"ఆమె వేలిముద్రలు కావాలి. ఈలోపు నేను లోపల వుంటాను." లిలియా గబగబ లోపల రూంలోనికి వెళ్ళింది. లక్ష్మీపతి బయటకు నడిచాడు.

లక్ష్మీపతి పల్లవిని లోపలకు పిలిచాడు.

పల్లవి ముఖంలో విషాదచ్ఛాయలు.

"ఏమిటమ్మా!" అతి ప్రేమగా అడిగాడు.

"మా అమ్మ చనిపోయిందండి. ఉన్న డబ్బులు మందులకై పోయాయి."

"చెప్పొద్దు. ఎంత కావాలి? ఐదువందలు చాలా?"

పల్లవికి మతిపోయినట్లయింది.

"చూడమ్మా! కూతురులాంటిదానివి. నీకు ఆపద వస్తే ఒకటీ, నాకు వస్తే ఒకటా?"

"వంద చాలండి."

"నీ యిష్టం. మిగిలినవి తీసుకువచ్చి యిచ్చెయ్. లేదా నీ యిష్టం" అంటూ బీరువాలోనుండి ఐదువందలు తీసి యిచ్చాడు.

"మంచినీళ్ళు త్రాగమ్మా!"

"వద్దండి" అంది పల్లవి.

"ఏడ్చి ఏడ్చి గొంతు ఆరిపోయివుంటుంది త్రాగమ్మా!"

పల్లవి మంచినీళ్ళ గ్లాసు అందుకుంది. నీళ్ళు త్రాగి గ్లాసు అక్కడే పెట్టింది. "వెళ్ళివస్తానండి."

"అలాగే! దహనసంస్కారాలు అయ్యాక కలువు."

పల్లవి తలూపి వెళ్ళిపోయింది.

లోపల గదిలోనుండి లిలియా వచ్చింది. "పథకం భలే పారింది. పల్లవి వేలిముద్రలు యింత తొందరగా దొరుకుతాయనుకోలేదు." అంది లిలియా.

లక్ష్మీపతి నవ్వాడు.

"గుడ్. వస్తాను. ఈసారి పల్లవిని మన గ్రిప్‌లో ఎలా వుంచుకోవాలో ఆలోచించి వస్తాను" లిలియా వెళ్ళిపోయింది.

లక్ష్మీపతి చూస్తూండిపోయాడు.

9

"సారీ పల్లవి. మీ అమ్మ చనిపోయేటప్పుడు నేను లేను."

"శవాన్ని వల్లకాడు చేర్చటానికి లక్ష్మీపతిగారిచ్చారు" మధు యెదురుగా కూర్చుంది పల్లవి.

టాంక్ బండ్ మీద కార్లు, ఆటోలు రద్దీగా వుంది.

సాయంకాలం చల్లగా, మనోహరంగా వుంది. కొన్ని నిమిషాలు యిద్దరి మధ్య మౌనం. "పల్లవీ! ఒక్కమాట సూటిగా అడుగుతాను, సమాధానం చెప్పగలవా?" ఆమె కళ్ళలోనికి చూశాడు.

"అడగండి."

"నేను మంచివాడ్నా? దుర్మార్గుడ్నా?"

"మీరు చాలా మంచివారు."

"అయితే కొన్నాళ్ళు నా యింట్లో వుండు. ఇలాంటి పరిస్థితిలో నీవు ఒంటరిగా వుండటం మంచిదికాదు."

"ఎలాంటి పరిస్థితిలో."

"అదే నీకు తెలీదు. వివరంగా చెపుతాను పద."

ఇద్దరూ కారెక్కారు. కొన్ని నిమిషాలకు మధు ఇల్లు చేరారు. మధు తాళం తీసి లోపలకు నడిచాడు.

నగరానికి కాస్త దూరంగావున్న చిన్నసైజు మేడ. ఒకవైపు ప్రకృతి, ప్రకృతిని ఆనుకున్న ఆ గదిలోనికి చల్ల గాలులు తెరలుతెరలుగా వీస్తుంటాయి.

"ఎలా వుంది?"

"చాలా బావుంది" అంది పల్లవి.

మధు నవ్వాడు. ఇప్పుడామెకు తను మంచి మిత్రుడననుకున్నాడు.

10

"గ్లాడ్ టు సీ యు" రూబెన్ అన్నాడు.

"వెరీ గ్లాడ్ టు సీ యు" అంది లిలియా.

రూబెన్ దగ్గరగా వచ్చాడు. "లక్ష్మీపతి విషయం ఏమయింది?" అడిగాడు.

"లిలియా తలచుకున్న పని దిగ్విజయం కావలసిందే."

"వెరీ గుడ్. యు ఆర్ జీనియస్."

"ఫణి వేలిముద్రలు తెచ్చావా?"

రూబెన్ నవ్వాడు. "ఫణి వేలిముద్రలు తేవటం ముఖ్యం కాదు. పల్లవి వేలిముద్రలు సంపాదించటం ముఖ్యం."

"లిలియా గురించి బాస్ చెప్పలేదేమో" అంటూ వేలిముద్రల ప్రొఫార్మ తీసింది. "వెరి గుడ్" అన్నాడు రూబెన్.

లిలియా బ్రాంది గ్లాసుల్లో ఒంపింది "చీర్స్."

"ఇప్పుడు రెండు వేలిముద్రలు టాలి చెయ్యాలి. ఆమె

పల్లవియేనా? లేక పల్లవిగా నటిస్తున్న ఫణియా? తెలుస్తుంది."

"యు ఆర్ కరెక్ట్!"

స్లేడ్‌లో అరేంజ్ చేశారు. వేలిముద్రలు ప్రతి సెంటీమీటరు, పది సెంటీమీటర్లుగా ఎక్స్‌పోజ్ చేసి చూశారు. ఇద్దరు ముఖాలు రంగులు మారాయి.

"అయితే?" అంది లిలియా.

"ఫణియే యీ పల్లవిగా నటిస్తుంది. ఇద్దరి వేలిముద్రలు ఒక్కటే" అన్నాడు రూబెన్.

లిలియా తలూపింది.

11

"ఏమండీ, ఎక్కడకు వెళ్ళారు?" బుంగమూతి పెట్టి అంది పల్లవి. మధు నవ్వాడు. "సినిమాకి."

"మీ రొక్కరే వెళ్ళాలా? ఇప్పటివరకు ఒక్కదానినే ఎలా వుండను. నా కెంతో భయం వేసింది. నన్ను మీతో సినిమాకి తీసుకువెళ్ళకూడదూ?" అంది పల్లవి.

"మధు పల్లవి కళ్ళలోనికి చూశాడు.

పల్లవి విషయంలో తనపట్ల ఆమె చూపే శ్రద్ధాసక్తులు చూస్తే మధుకి విచిత్రమైన ఆలోచనలు కలుగుతున్నాయి. నిన్ను ప్రేమిస్తున్నానని అనలేదు. అంటే ఆమె యిల్లు వదిలి వెళ్ళిపోతుందనే భయం.

మరునాడు పాలిస్టర్ చీర తెచ్చాడు. "ఎలా వుంది యీ చీరె?" అడిగాడు.

"చాలా బాగుంది. ఎవరికండీ?"

"నా కాబోయే భార్యకి."

పల్లవి ముఖంలో రంగు మారటం గమనించాడు.

బహుశా ఆమె తనను ప్రేమిస్తూ, తనలాగే చెప్పలేక బాధపడుతుందేమో అనుకున్నాడు. "ఎలా వుంది?"

"చాలా బావుంది."

"కట్టుకో మరి."

"అంటే?" విస్తుపోయింది.

"ఈ చీర నీ కొరకే."

"అయితే, మీ కాబోయే భార్య నేనన్నమాట."

"అవును."

పల్లవి గబాలున ప్రక్కగదిలోనికి వెళ్ళి తలుపు వేసుకుంది.

మధుకి మతిపోయినట్లయింది. లోపల ఏడుస్తున్న శబ్దం వినిపించింది. "పల్లవి... పల్లవి" పిలిచాడు.

పల్లవి తలుపు తెరిచింది. కన్నీరు నిండిన కళ్ళు. మధుకి బాధ కలిగింది. "ఏడుస్తున్నావా?"

తలూపింది.

"ఎందుకు?"

"ఈ సమయంలో మా అమ్మ వుంటే?" అంది. మధు, పల్లవిని గుండెలకు హత్తుకున్నాడు. పల్లవి అతని కౌగిలిలో ఒదిగిపోయింది.

12

మధు, పల్లవిల పెళ్ళి జరిగిపోయింది.

అచ్చట్లు, ముచ్చట్లు అన్నీ సాంప్రదాయం ప్రకారమే జరిగాయి. పెళ్ళికి లక్ష్మీపతి రావటం మధుకి యిష్టం లేకపోయినా, పల్లవి యిష్టప్రకారం పిలిచాడు.

ఆ రోజునుండి దాదాపు పదిహేనురోజులు పల్లవికి పండుగలా వుంది. మధు పడకపైనుండి ప్రక్కకు రానివ్వ

టంలేదు. ఎప్పుడూ అలాగే వుంటే అవతలివాళ్ళేమను కుంటారో అని సిగ్గుపడేది పల్లవి.

మరి కొన్నిరోజులు క్రొత్త జంట నగర సంచారం, సినిమాలు, షికార్లు, ఊరులోనికి వచ్చిన సర్కసుని, ఎగ్జిబిషన్‌ని అలసిపోయేలా చూస్తున్నారు.

ఆ రోజు—

పల్లవి గదిలో కూర్చొని పుస్తకం తిరగేస్తుంది.

బజర్ మ్రోగింది.

ఆత్రుతగా వచ్చింది పల్లవి. ఎదురుగా లక్ష్మీపతి యింటి నౌకరు నిలబడివున్నాడు.

"ఏమిటి?"

"లక్ష్మీపతికి యాక్సిడెంట్ అయింది. డాక్టర్ బ్రతకరని చెప్పాడు. ఆయన చివరసారిగా మిమ్మల్ని చూడాలంటున్నారు."

పల్లవికి బాధ కలిగింది.

"అయ్యో...యిప్పుడెలా?"

"ఒక్కసారి కనిపించి వెళ్ళండమ్మా."

"ఆయన యింట్లో లేరు."

"ఎంతలో వస్తారు? కారులో వెళ్ళి కారులో వచ్చేద్దురు. రండమ్మా" బ్రతిమిలాడాడు.

పల్లవికి ఏం చేయాలో తోచలేదు. తండ్రిలాంటి లక్ష్మీపతి, తన తల్లి అంత్యక్రియలకు డబ్బు యిచ్చిన మహానుభావుడు.

ఏం చెయ్యాలి?

"ఆలోచిస్తే లాభంలేదు. ఆయన చనిపోయాక ఆయన శవంమీద పువ్వులువేయటం తప్ప మీరేం చెయ్యలేరు."

పల్లవి ఆలోచించలేదు. మౌనంగా బయలుదేరింది.

13

లక్ష్మీపతి యింటిముందు కారాగింది. ఆత్రంగా లోపలకు నడిచింది. లోపల అంతా నిశ్శబ్దంగా వుంది. అంతా కలయచూసింది. గడియారం టిక్ టిక్ మంటుంది.

ప్రక్కగదిలోనుండి ఎవరో వచ్చారు. "అయ్యగారు లోపల వున్నారమ్మా" అన్నాడు. పల్లవి ఆత్రంగా లోపలకు నడిచింది.

లోపలకు ప్రవేశిస్తూనే స్తంభించిపోయింది.

లక్ష్మీపతి సోఫాలో సాఫీగా కూర్చున్నాడు. ఎదురుగా బ్రాంది సీసాలు, గ్లాసులు వున్నాయి. అంతలో వెనుక తలుపులు మూసుకుపోయాయి. కాదు లిలియా మూసి వేసింది.

పల్లవికి ఎందుకో భయం వేసింది.

"ఆగావేం? రా పల్లవీ" నిషా నిండిన కళ్ళు నిశితంగా చూస్తూ పిలుస్తున్నాయి. పల్లవికి కంగారుగా అయోమయంగా వుంది. చేతులు చల్లబడ్డాయి.

"మీకు యాక్సిడెంట్ అయిందట."

"నాకు కాదు, నా మనసుకి. నీలాంటి అందాలరాశిని అనుభవించాలని యీవేళ క్రొత్తగా కోరిక కలిగిందిలే" లక్ష్మీపతి లేచాడు.

"బాబుగారూ!"

"తప్పు, బావగారు అని పిలవాలి" దగ్గరకు వస్తున్నాడు. పల్లవి విస్తుపోయింది. చేతులు కాళ్ళు వణికిపోతున్నాయి. గభాలున తలుపు దగ్గరకు వెళ్ళబోయింది.

పులిలా లంఘించాడు. అతని చేతుల్లో ఇమిడిపోయింది. "వదలండి...మీ బిడ్డలాంటిదాన్ని" అంటూ వణికిపోతూ ఏడుస్తోంది.

లక్ష్మీపతి అదేమీ వినిపించుకోలేదు. ఆమె శరీరంమీద వున్న చీరె లాగాడు.

పల్లవి అరిచింది. బలంగా త్రోసి మూలకు పడింది. లక్ష్మీపతి వికృతంగా నవ్వాడు. టీపాయిపై వున్న ప్లవర్ వాజ్‌తో కొట్టింది. లక్ష్మీపతి తప్పుకున్నాడు. మళ్ళీ సమీపిస్తున్నాడు.

పల్లవి ఏం చేయాలి? అని వెదికింది.

ఎదురుగా రేడియోబల్లపై రివాల్వర్ వుంది.

ఆత్రతగా రివాల్వర్ అందుకుంది. "దగ్గరకు వస్తే చంపుతాను."

లక్ష్మీపతి భయపడలేదు. దగ్గరకు వస్తూనేవున్నాడు.

పల్లవి చేతిలో రివాల్వర్ పేలింది. లక్ష్మీపతి అరుస్తూ నేల కూలాడు.

పల్లవి ఒక్కక్షణం కొయ్యబారిపోయింది. అంతలోనే తమాయించుకొని, కిటికీ తలుపులు తీసుకొని దొడ్డిదారి గుండా ఇంటివైపు పరుగుతీసింది.

మధు ఇంటిదగ్గరనే వున్నాడు. అంతా విని ప్రాన్పడిపోయాడు.

పల్లవి ముఖానికి చేతులుపెట్టుకొని ఏడువసాగింది. మధు మతి చెడినట్లు గదిలో పచార్లు చేస్తున్నాడు.

"నేను హత్య చేశానండి" అంటుంది పల్లవి.

"నేను మొదట్నుండీ చెపుతున్నాను. నీవేదో విష వలయంలో చిక్కుకుంటావని. ఇప్పుడేం చెయ్యాలి?"

"ఎటైనా పారిపోదామండి."

"సరే. వెంటనే బట్టలన్నీ సర్దు. ఆగ్రాలో నా ఫ్రెండ్ వున్నాడు, వాడి దగ్గరికే పోదాం."

క్షణాలలో పెట్టి, బెడ్డింగ్‌తో బయటపడ్డారు.

14

రోజులు దొర్లిపోతూ ఏడాది గడిచింది.

ఏడాదిలో పల్లవి ఇంగ్లీషు బాగా నేర్చుకుంది. పల్లవికి నాలుగు నెలల పాప. ముచ్చటైన సంసారంగా గడిచి పోతుంది.

పల్లవి లక్ష్మీపతి హత్య గురించి దాదాపు మరచి పోయింది. మధుమాత్రం పోలీస్ డిపార్టుమెంట్ యీ హత్య మరచిపోదని ఆలోచిస్తూనే వున్నాడు.

డిటెక్టివ్‌ని నియమించాలంటే పల్లవి తనే యీ హత్య చేశానంటుంది. పల్లవి జైలుకు వెళ్ళితే తను బ్రతకగలడా అన్నది ప్రశ్నయింది. అగ్రా మారుమూల యెంతకాలం యిలా తల దాచుకోవాలి. హత్య రహస్యం తాత్కాలి కంగా సద్దుమణిగినా ప్రభుత్వపు దృష్టిలో సద్దు మణగదు.

ఆ రోజు సాయంకాలం ఆరుగంటల ప్రాంతంలో పల్లవి బయలుదేరింది. "ఎక్కడికి ప్రయాణం?"

"మధ్యాహ్నం చెప్పాను కదండి. బేగం, నేను సిని మాకి వెళుతున్నాం" అంది పల్లవి బాబుకి చొక్కా వేస్తూ.

మధు నవ్వాడు. పల్లవి అడిగింది, "ఎందుకు నవ్వు తున్నారు?"

"తెలుగు సినిమాలు మరచి, హిందీ సినిమాలు చూడ టానికి అలవాటు పడ్డావ్. ఓ. కె. ప్రొసీడ్!"

"మీరు రాకూడదూ?"

"ఆడవాళ్ళ మధ్య మగవాడు రావటం ఆరోగ్యం కాదు, నీవు వెళ్ళిరా" అన్నాడు మధు.

పల్లవి, బేగం వెళ్ళిపోయారు.

15

టాక్సీ దిగాక టాక్సీకి డబ్బులు యిచ్చి బేగం వాళ్ళింటి నుంచి తన యింటికి వచ్చింది.

లోపల లైట్లు వెలుగుతున్నాయి గాని, యిల్లంతా నిశ్శబ్దంగా వుంది.

"ఏమండీ!" అని పిలిచింది.

అప్పటివరకు తలుపు చాటునున్న వ్యక్తి, "కూర్చోమ్మా, నీతో మాట్లాడాలి" అన్నాడు.

పల్లవి ఉలిక్కిపడింది, మరుక్షణంలో కంగారుపడింది. "ఎవరు మీరు?"

మరొక గదిలోనుండి మరొక వ్యక్తి వచ్చాడు. పల్లవి ముఖం భయంతో కంపిస్తుంది. "ఎవరు మీరు? నా భర్త ఎక్కడ?"

"నిన్ను మేమేదో చేయటానికి రాలేదు. నీ భర్త మధులక్ష్మీపతిలా చంపబడలేదు. క్షేమంగా వున్నాడు."

పల్లవి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

"మరేం భయపడకు, నీతో మాట్లాడాలి."

బాబును సోఫాలో పడుకోబెట్టి కూర్చుంది. ముఖం నిండా చెమటలు పోశాయి.

"నీవల్ల ఒక సహాయం కావాలి. నీవు మామూలుగా అడిగినట్లయితే చెయ్యవు. అందుకే నీ భర్తను తీసుకు వెళ్ళిపోయాం."

"ఎక్కడికి?" కంగారుగా లేచింది.

"తొందరపడక. నీ భర్తకు యే ఆపదా రాదు. నీవు మాకీ సహాయం చేస్తే రెండు లక్షలతోపాటు అమెరికా పాస్‌పోర్టు యిచ్చి పంపగలం.

నే నెవరో నీకు తెలియకపోవచ్చు. నా పేరు చరణ్. నీవు మాత్రం చాలాకాలంగా నాకు తెలుసు. ఎలా? లక్ష్మీపతిని నీవు హత్య చేసింది మొదలు, అంతా తెలుసు. అయితే నిన్ను వెదకి పట్టుకోవటానికి మాకు యేడాది పట్టింది.

ఇంకా నీపై హత్యానేరం వుంది. సరే, ఆ విషయం వదిలేయ్. కొన్నాళ్ళుగా ఫణి అనే పేరుగల అమ్మాయి నీకు తెలుసా?"

"తెలీదు."

"అయితే, ఆ అద్దంముందు నిలబడి చూడు" అన్నాడు.

పల్లవి సంకోచంగా అద్దం ముందుకు నడిచింది. అందులో తన ప్రతిబింబమే కనిపించింది. పల్లవికి అర్థం కాలేదు.

"నీకు అర్థం కాలేదు. రెండు సంవత్సరాల క్రితం నీ మతి చెడిపోయింది. నీ అసలు పేరు ఫణి" చరణ్ అన్నాడు.

"నాకు మతిపోవటం ఏమిటి?"

"ఇప్పుడు మాకు కావలసింది ఆ ఫణి కాదు, అలాంటి నీవు. ఫణి అమెరికానుండి వస్తూ, కొన్ని లక్షల విలువ చేసే డైమండ్స్ తెచ్చింది. అవి సేఫ్ బాక్స్ నెంబరు 346 లో జాగ్రత్త చేసింది. అది టాప్ సీక్రెట్ సేఫ్ బాక్స్ కాబట్టి, ఉన్నతమైన ఒక బాంకి ఆధ్వర్యంలో వున్నాయి.

ఆ బ్యాంక్‌లో నీ ఫొటో, అంటే ఫణి ఫొటో వుంటుంది. ఆ ఫోటో గల అమ్మాయి వచ్చినప్పుడే ఆ సేఫ్ బాక్స్ లాకర్ ఇస్తారు. ఏ మాత్రం అనుమానం తగిలినా వెంటనే అరెస్టు చేస్తారు.

ఎంతో ప్రయత్నంమీద బ్యాంక్‌కి సంబంధించిన ఫణి పాస్‌బుక్ సంపాదించాం. ఆ బుక్‌తో నీవు ఫణిగా వెళ్ళి ఆ వజ్రాలు తీసుకువచ్చి మాకు అప్పగించు. నీ భర్తతో పాటు కొన్ని వేల రూపాయలు నీ కివ్వబడతాయి. లేదా నీ భర్త శవంతోపాటు నీ శవం డ్రెయినేజిలో వేస్తాం. రేపే బొంబాయి ప్రయాణం రెడీగా వుండు."

వివరించి మరోసారి చెప్పాడు చరణ్. పల్లవికి అంతా అర్థమైంది. తానేదో విషవలయంలో చిక్కుకున్నట్టు అర్థం చేసుకుంది పల్లవి,

16

హోటల్ గదిలో—

నిద్రనుండి కళ్ళు తెరచిన పల్లవి స్తంభించిపోయింది. ఎదురుగా మురారి. మురారి చేతిలో కత్తి, ఆ కత్తి బాబుకు దగ్గరగా వుంది. బాబు గుక్కపట్టి ఏడుస్తూన్నాడు.

"ఎవరు నీవు? ఏమిటి యిది?" గబాలున లేచి బాబును అందుకోబోయింది.

"ఆగు." బాబు గుండెపై కత్తి పెట్టాడు మురారి. వికృతంగా నవ్వాడు.

"నా పేరు మురారి. చరణ్‌లా నేను వజ్రాలకొరకు యిక్కడకు వచ్చాను. చరణ్ దగ్గర ఫణి పాస్ బుక్ వుంది. పాస్ బుక్ యిప్పుడు నీ చేతిలో వుంది."

అయోమయంగా చూసింది పల్లవి.

"మరేం దిగులుపడక. భర్త పోతే రత్నగర్భయిన ఈ భారతదేశంలో భర్తలకు కొదువలేదు."

పల్లవి మనసు చివుక్కుమంది.

"పోనీ నీకు బాధ కలిగిస్తే క్షమించు. నీవు ఫణివి కాదు, పల్లవివి అని నాకు తెలుసు"'

"ఎలా తెలుసు?"

"ఫణిని నేనే చంపాను కాబట్టి."

పల్లవికి శ్వాస ఆగిపోయినట్లయింది.

"నిన్ను మాత్రం చంపను. ఊరికే చంపేయటం నాకు అలవాటు కాదు కూడా. అందుకే చెపుతున్నాను, శ్రద్ధగా, బుద్ధిగా విను. ఆ వజ్రాలు నాకే చెందాలి" మురారి అన్నాడు.

పల్లవి నిశితంగా చూసింది.

"ఆ వజ్రాలు నాకు కాకుండా చరణ్‌కి యివ్వటం జరిగితే నీ బాబును..." అంటూ కత్తి బాబు గుండెపై పెట్టాడు.

"వద్దు...నా బాబును ఏం చేయవద్దు."

"సారీ! నేను ఏ పరిస్థితిలోనూ నీ బాబుకి కీడు చేయను. అలా చేయకూడదనుకుంటే రేపు తెచ్చే వజ్రాలు నా చేతికే యివ్వాలి. ఆలోచించుకో..."

బాబును తీసుకొని మురారి వెళ్ళిపోయాడు.

పల్లవి మిగిలిపోయింది,

ఒకవైపు భర్త, మరొకవైపు బిడ్డ, ఈ పరిస్థితిలో తనేం చెయ్యాలి? ఎవర్ని పోగొట్టుకోవాలి తను? వజ్రాలు కాజేసి ప్రభుత్వం దృష్టిలో నేరస్తురాలు అవ్వాలి. చాలా సామాన్యురాలైన తనకు ఏమిటి ఈ అగ్నిపరీక్ష?

మురారికి వజ్రాలు యిచ్చివేస్తే మధు చచ్చిపోతాడు. చరణ్‌కు యిస్తే బాబు చచ్చిపోతాడు. ఎవరు పోయినా తను బ్రతకలేదు. ఈ పరిస్థితిలో తనేం చెయ్యాలి? తన నెవరు కాపాడలేరు.

కళ్ళలోనుండి ధారగా కన్నీరు ప్రవహిస్తుంది.
గుండెలవిసిపోయేలా దుఃఖించింది.

17

తెల తెలవారుతుంది.

ఎవరో గదిలోనికి వచ్చారు. కళ్ళు తెరిచింది. ఎదురుగా మురారి.

"చూడు పల్లవీ! నీకు మరొక పరీక్ష ఎదురైంది. వాళ్ళు పాస్ బుక్ యిచ్చారు. కాని తాళం యివ్వలేదు. అది వుంటే నీకు యిచ్చివుండేవాళ్ళు. ఎనీహావ్, నీవు ఆ తాళం పోగొట్టుకున్నానని చెప్పాలి."

పల్లవి ఆత్రంగా చూసింది.

"అవును. అప్పుడు నీ వేలిముద్రలు, క్రితంలో ఫణిగా వేసిన వేలిముద్రలు చూస్తారు. నీవే అని నమ్మకం కలిగితే ఆ తాళం పగలకొట్టించి నష్టపరిహారం నీపై వేస్తారు."

"వేలిముద్రలు ఒకటి కాకపోతే?"

మురారి సంకోచించాడు. "అందుకే నీ వేలిముద్రలు చెక్ చెయ్యాలి." అంటూ పల్లవి వేలిముద్రలు తీసుకున్నాడు. అతని ప్రక్కనే వున్న రంజిత్ వేలిముద్రలు అందించాడు. అవి ఫణి వేలిముద్రలు.

మురారి ముఖం రంగు మారింది. రంజిత్ అడిగాడు. "ఏమిటి బాస్?" మురారి, రంజిత్ ముఖంలోనికి చూశాడు.

"అదేమిటి బాస్! మీ చేతులతో చంపారు. శవాన్ని నేనే పాతిపెట్టాను."

"నమ్మలేకుండా వున్నాను."

"ఎందుకని బాస్?"

"మనిషిని పోలిన మనిషి వుండటంలో ఆశ్చర్యంలేదు. కాని వేలిముద్రలు పోలిన వేలిముద్రలు వుండటం ఇంపాసిబుల్. నాకు అయోమయంగా వుంది."

"అది ఒకందుకు మంచిదేగా బాస్!"

"మంచిది కాదని కాదు. చాలా మెరికల్‌గా వుంది యీ ప్రశ్న. ఎనీహావ్ బాబును జాగ్రత్తగా వుంచు. పల్లవిని ఒక్కర్తినే టాక్సీలో పంపాలి."

"ఆ తరువాత."

"పల్లవి బాంక్ నుండి బయటకు రావటంతోనే వజ్రాలు మన చేతికి చిక్కించుకోవాలి. మనలా చరణ్ కూడా ప్రయత్నిస్తాడు. ఆ పథకం నేను చూస్తాను."

18

పల్లవి ఎక్కిన టాక్సీ మురారి ఇంటినుండి మలుపుతిరిగి హైరోడ్ మీద పోతుంది. పల్లవి చేతిరుమాలుతో ముఖంపై చెమటను అద్దుకుంది. రోడ్డుకు రెండువైపుల డాబాలు, షాపింగ్‌లు చూస్తూంది.

వెనుకగా పోలీస్ జీపు.

తడబడి రెండుసార్లు చూసింది. పోలీస్ జీపు తనను వెంబడిస్తోంది. గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. తనను పోలీసులు ఎలా గమనించివుంటారు అనుకుంది.

పోలీస్ జీపు మెల్లగా సమీపించి ముందుకు సాపోయింది. బరువుగా నిట్టూర్చింది.

"అలా భయపడితే వజ్రాలు ఎలా తెస్తావ్ పల్లవీ!" టాక్సీ డ్రైవర్ అనటంతో ఉలిక్కిపడింది.

"ఎవరు నీవు?"

టాక్సీ ఒక ప్రక్కగా ఆపాడు. "ధీరజ్! ఐ మీన్

ఫణి భర్తను. నీవు మరచివుంటావు. చూడు ఫణీ! నీవు పల్లవిగా ఎంత నటించినా నాకు తెలుసు. ఇదిగో సేఫ్ బాక్స్ తాళం.'' అందించాడు.

''నీవు నాకు యిచ్చావ్. మరచిపోయివుంటావ్!''

పల్లవి అయోమయంగా చూసింది.

''ఇక పోతే అసలు విషయం. ఈ టాక్సీ బాంక్ బయట వుంచుతాను. నీవు వజ్రాలు తీసుకొని తిన్నగా నా దగ్గరకు రావాలి. నా టాక్సీలో ఎక్కాలి. లేదా నీ గురించి పోలీస్‌కి ఇన్ఫర్మేషన్ ఇస్తాను.''

మతిపోయినట్లయింది పల్లవికి.

''మరి నా భర్త, నా బిడ్డ?''

''నాలాగా భర్త పోతే భర్త, బిడ్డ పోతే బిడ్డ దొరక వచ్చు. కాని నీవు జైలుపాలైతే యింకేముంది?''

పల్లవికి అతని మాటలు అసహ్యం కలిగించాయి. కోపంతో ముఖం ఎర్రనైంది. కాని ఏం చేయలేదు.

''అలాగే!'' అంది పల్లవి.

ఈ పరిస్థితిలో తను ఆత్మహత్య చేసుకుంటే తన బాబు ఫలానాచోట వున్నాడని భర్తకు ఎలా తెలుస్తుంది? ఆలోచిస్తూవుండగానే టాక్సీ బాంక్ ముందాగింది.

10

బాంక్ లోపలకు వెళ్ళుతూ చూసింది పల్లవి.

ఒక ప్రక్క చెట్టుక్రింద మురారి కారు ఆగివుంది. రోడ్డు మలుపులో చరణ్ కారు ఆగివుంది. కొద్ది దూరంలో ధీరజ్ టాక్సీ ఆగివుంది. గుండెల్లో వణుకుపుట్టింది.

పల్లవి బాంక్ లోపలకు నడిచింది.

కౌంటర్ లోపలకు వెళ్ళి విత్‌డ్రాయల్ అన్న చిన్న బోర్డు దగ్గర ఆగి పాస్‌బుక్ యిచ్చింది. తలెత్తి చూశాడు.

"మిస్ ఫణీ! దాదాపు మూడేళ్ళయింది. మీ నెంబరు బాక్స్ అలాగే వుంచాం. ఇంకో ఏడాది దాటితే అది పగలగొట్టటం జరిగేది."

పల్లవి ఏం మాట్లాడలేదు. అతను సంతకం పెట్టి మరో కౌంటర్‌లోనికి పంపాడు. అక్కడకు నడిచింది.

"మీరు యింతకాలం ఎందువల్ల మీ మెటీరియల్ రిసీవ్ చేసుకోలేదు."

"ఫారిన్‌లో వున్నాను."

"ఐ.సి. ఏజెంట్ దగ్గరకు వెళ్ళండి" అంటూ సైన్ చేసి యిచ్చాడు. గొంతు తడారిపోయింది పల్లవికి. మెల్లగా ఏజెంట్ రూంలోనికి నడిచింది.

ఏజెంట్ గుంభనంగా, గంభీరంగా వున్నాడు. పాస్‌బుక్ అందించింది. నిశితంగా చూశాడు. తను తొట్రుపడింది.

"మే ఐ సీ యువర్ ఫింగర్ ప్రింట్."

"వై నాట్" భయాన్ని కప్పి పుచ్చుకుంటూ అంది.

ఏజెంట్ బజర్ నొక్కాడు. వేలిముద్రలు తీసుకోటానికి వచ్చిన వ్యక్తి వేలిముద్రలు తీసుకొని వెళ్ళిపోయాడు.

"జెస్ట్ త్రీ మినిట్స్."

ముళ్ళపై కూర్చున్నట్లుంది పల్లవికి. ముఖంపై చెమట బిందువులు చేతిరుమాలుతో తుడుచుకుంది. ఏజెంట్ గమనిస్తూనే వున్నాడు. పల్లవికి అసహనంగా, ఆందోళనగా వుంది.

వేలిముద్రలతో అతను వచ్చాడు. "సర్."

తలెత్తి చూశాడు ఏజెంట్. "ఫణి వేలిముద్రలు, ఈమె వేలిముద్రలు ఒక్కటి కావు. వేరు వేరు వేలు ముద్రలు. ఈమె ఫణి కాదు."

గభాలున లేచింది పల్లవి.

"కూర్చోమ్మా" అన్నాడు లోపలకు వస్తూ లక్ష్మీపతి.

లక్ష్మీపతిని చూసి మతిపోయినట్లయింది.

"కూర్చో పల్లవీ" లక్ష్మీపతి అన్నాడు.

పల్లవి ఉపేక్షించకుండా ఏజెంట్ బల్లపై వున్న కత్తి తీసుకొని గభాలున పొడుచుకోబోయింది. లక్ష్మీపతి చటుక్కున చేయి పట్టుకున్నాడు.

"వదలండి, నేను చావాలి."

లక్ష్మీపతి నవ్వాడు. "నీవు చావకూడదు. నీవు ఏ పరిస్థితిలో చావాలనుకున్నావో నాకు తెలుసు."

పల్లవి ప్రశ్నార్థకంగా చూసింది.

"చూడమ్మా, నీవేమీ భయపడవద్దు. నిన్ను, నీ భర్తను, నీ బిడ్డను రక్షించటానికే లక్ష్మీపతి వచ్చారు. నిన్ను అరెస్టు చెయ్యం" అన్నాడు లక్ష్మీపతి వెంటనున్న మరో వ్యక్తి.

పల్లవికి అర్థం కాలేదు.

"లక్ష్మీపతి ఎవరో కాదు. ప్రఖ్యాత డిటెక్టివ్ పి.జె."

విస్తుపోయింది పల్లవి.

"అవునమ్మా. నీ భర్తను, నీ బిడ్డను రక్షిస్తాను. నిన్ను వెంటాడుతున్నవి మూడు గాంగులు. వాళ్ళను బయట పోలీసులు బంధించారు. విషయాలు తరువాత వివరిస్తాను. పద," అన్నాడు పి. జె.

పల్లవి కళ్ళలో నీరు నిండాయి.

20

మధు, పల్లవి, డిటెక్టివ్ పి. జె., ఇతర క్రైం బ్రాంచి ఆఫీసర్లు, కమీషనర్ ఆఫ్ పోలీస్ అందరూ కూర్చొని వున్నారు.

"నేను లక్ష్మీపతి నటన ప్రారంభించటానికి పల్లవి కారణం కాదు. అయితే మరొక కేసుగురించి దర్యాప్తు చేస్తుండగా పల్లవి కనిపించింది. పోలీస్ రికార్డులో ఫణిగా వున్న ఆమె ఫోటో చూసి అనుమానించాను.

అదృష్టవశాత్తు లిలియా నన్ను ఆశ్రయించింది. లిలియాను ఆ క్షణంలో బంధించవచ్చు. అయితే లిలియా వెనకవున్న గాంగ్ ని పట్టుకోవాలని తలాడించాను. లిలియాకు విధేయుడనయ్యాను. పల్లవి వచ్చినపుడు ముందే పల్లవికి పథకం గురించి చెపితే లాభంలేదని అలా నటించాను.

నేను ఊరిలో లేనప్పుడు మరొకరికి నాలాగా మేకప్ వేయించి, అతడిని పల్లవి చంపినట్లుగా నాటకమాడారు. అయితే పల్లవి భయపడి ఆగ్రా పారిపోయింది. దాంతో దుండగులకు ఆమెను వెదికి పట్టుకోవటానికి ఏడాది పట్టింది.

"పల్లవి నన్ను చంపలేదు. కాబట్టి ఆమె జీవితాన్ని కాపాడగలిగాను" పి. జె. ఆగాడు.

"మరి నా వేలిముద్రలు, ఫణి వేలిముద్రలు ఒకటే అన్నారు. అదెలా జరిగింది."

"అది క్రితంలో ఫణి నిన్ను చూసివుండాలి. నీకు తెలియకుండా నీ వేలిముద్రలు తీసి తనపై ఏదో నేరం వచ్చే పరిస్థితిలో నీ వేలిముద్రలు వినియోగించుకొని వుండాలి. అంటే నీ వేలిముద్రలు సింగర్ ప్రింట్ చేయించేసింది. నీకు ఫణి తెలియకపోయినా, ఫణికిమాత్రం నీవు తెలుసు. ఇది నా ఊహమాత్రమే" పి. జె. అన్నాడు.

"ఏమైనా మా జీవితాలు కాపాడారు" అంది పల్లవి కృతజ్ఞతాపూర్వకంగా.

—: ఐపోయింది :—